‘రహదారి’పై రాజకీయం

జాతీయ రహదారి ఏర్పాటులో వేల మంది అవసరాన్ని పక్కన పెట్టేశారు. పది కాలాల పాటు పనికి వచ్చే పనిని తప్పుదారి పట్టిస్తున్నారు. ఎంపీ ఒత్తిళ్లకు తలొగ్గి జాతీయ రహదారి నిర్వాహకులు ప్రజలతో చెలగాటమాడుతున్నారు. అవసరం లేని చోట అండర్‌పాస్‌ల పేరుతో నిధులు వృథా చేస్తున్నారు.

- ఎర్ర గూడూరులో అవసరం లేని చోట అండర్‌పాస్‌కు యత్నం
- ప్లాన్‌లో లేకున్నా పనులు మరూ
- ఎంపీ ఒత్తిడికి తలొగ్గిన ఎన్‌హెచ్ అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు



ఎర్ర గూడూరు గ్రామం మధ్యలో ఎన్‌హెచ్ 340సి రహదారి నిర్మాణం



అండర్ పాస్ వద్దని ఎన్‌హెచ్ 340సి పీడీ పద్మకు విన్నవిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరురూరల్: కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్340సి) పనులు స్థానికులకు తలనొప్పిగా మారుతున్నాయి. ప్రజలకు అవసరమైన చోట కాకుండా రాజకీయ నాయకులు చెప్పిన చోట్ల అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తూ సమస్యలు తెచ్చిపెడుతున్నారు. ఆత్మకూరు సమీపంలో కల్వకుర్తి – నంద్యాల ఎన్‌హెచ్167కె, ఎన్‌హెచ్ 340సి ని క్రాస్ చేసే విషయాన్ని అధికారులు మర్చిపోవడం మహా తప్పిదం. రోడ్డు క్రాసింగ్‌ను ఏమాత్రం పట్టించుకోకుండా పనులు వేగంగా పూర్తి చేస్తూ కరివేన – ఆత్మకూరు మధ్య రహదారిని దాదాపు పూర్తి చేశారు. ఆత్మకూరు పట్టణంలోకి లింక్ ఇస్తూ ఒక పెద్ద అండర్ పాస్‌ను 340సి అధికారులు ఏర్పాటు చేశారు. మళ్లీ దాని పక్కనే వేసిన రోడ్డును తవ్వి ఎన్‌హెచ్ 167కె కోసం మరో తగ్గను తవ్వాల్సి వస్తోంది. ఈక్రమంలో రాజకీయ నాయకుల జోక్యం మరింత క్లిష్టంగా మారింది.

ఎర్ర గూడూరులో..

పాములపాడు మండలం ఎర్ర గూడూరు గ్రామం మధ్య 340సి వెళ్తోంది. డీపీఆర్ ప్రకారం గ్రామంలో ఎలాంటి అండర పాస్ లేదు. కానీ గ్రామంలో ఉన్న టీడీపీ రెండు వర్గాల మధ్య మాట పట్టింపు కోసం అవసరం లేని చోట అండర్ పాస్ కోసం డిమాండ్ చేశారు. అధికారులు ఒప్పుకోక పోవడంతో ఏకంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వద్దకు వెళ్లిన ఎంపీ గ్రూపు టీడీపీ గ్రామ నాయకులు ఆమె చేత ఎన్‌హెచ్ అధికారులకు తమ డిమాండ్ ఒప్పుకునేలా ఒత్తిడి చేయించారు. జాతీయ రహదారి 340సి ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ గ్రామంలోకి ప్రజలతో అండర్ పాస్ అవసరంపై విచారణ జరిపారు. అక్కడ హాజరైన గ్రామస్తుల్లో మెజారిటీ ప్రజలు అండర్ పాస్ వద్దే ఆమెకు తెలిపారు. అంతే కాకుండా సంతకాల సేకరణ జరిపి ఎంపీ శబరికి, ఎన్‌హెచ్ అధికారులకు పంపారు. కానీ ఎంపీ ఒత్తిడి మేరకు అధికారులు డీపీఆర్‌లో లేని అండర్ పాస్ నిర్మించేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా ఉన్నతాధికారులకు ప్రపోజల్ పంపించారు.

అండర్‌పాస్‌తో సమస్యలు

ఎర్ర గూడూరు గ్రామ సమీపంలోనే ఎస్ఆర్ఎంసీ ప్రధాన కాలువ రోడ్డును క్రాస్ చేస్తూ ఉంది. గ్రామంలో అండర్ పాస్ కోసం ఫ్లైఓవర్ కడితే దాని జీరో పాయింట్ కాలువను ఆనుకుని పడుతుంది. దీంతో ప్రమాదం అంటూ జరిగితే వాహనాలు నేరుగా 100 అడుగుల డీప్ కట్‌లో పడిపోతాయి. అధిక ప్రాణ నష్టం జరిగే అవకాశాలున్నాయి. అండర్‌పాస్ ఎర్ర గూడూరు – కంబాలపల్లె మధ్య నిర్మిస్తే అటు ఇస్కాల, ఇటు శాంతి నిలయం వైపు ఉన్న గ్రామ పంటపొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



ఎన్‌హెచ్ 167కే క్రాసింగ్ ను పట్టించుకోకుండా ఆత్మకూరు వద్ద కడుతున్న బైపాస్ అండర్‌పాస్

మెజారిటీ గ్రామస్తుల అభిప్రాయం బుట్టదాఖలు



అండర్‌పాస్‌పై మెజారిటీ గ్రామస్తుల అభిప్రాయాన్ని బుట్టదాఖలు చేశారు. ఎన్‌హెచ్ అధికారులకు గ్రామస్తుల అభిప్రాయం కంటే కేవలం కొందరు నాయకుల అభిప్రాయానికే విలువ ఇస్తున్నారు. అవసరం లేని చోట అండర్‌పాస్ ఏర్పాటుకు పనులు చేపడుతున్నారు. ఎర్ర గూడూరు – కంబాలపల్లె మధ్య అండర్‌పాస్ కడితే అందరికి ఉపయోగం ఉంటుంది.

– నాగార్జున, గ్రామస్తుడు, ఎర్ర గూడూరు

ప్రతిపాదనలు పంపాం

అండర్ పాస్ కావాలన్న ఎర్ర గూడూరు గ్రామస్తుల విజ్ఞప్తిని మార్క్ చేస్తూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఉత్తరం రాశారు. ఆమె సూచన మేరకు ఎర్ర గూడూరులో అండర్ పాస్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. సాంకేతిక ఇబ్బందులను అధ్యయనం చేసి అండర్‌పాస్ నిర్మిస్తాం.

– పద్మ, ఎన్‌హెచ్ 340సి పీడీ

ప్రమాదపుటంచున సిద్దపల్లె జంక్షన్

ఆత్మకూరు సమీపంలో ఎన్‌హెచ్ 340సి బైపాస్‌లో సిద్దపల్లె మార్గం గురించి పట్టించుకోకుండా రోడ్డు మొదలు పెట్టారు. అయితే ఐదు ఊర్ల గ్రామస్తులు ఆందోళనలు చేసిన అనంతరం అండర్ పాస్ కోరిన ప్రజల మాట కాదని.. అక్కడ ఓ జంక్షన్ ఏర్పాటుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వేగంగా వాహనాలు ప్రయాణించే హైవే బైపాస్‌లో జంక్షన్ పెట్టడం వల్ల అవగాహన లేని గ్రామీణులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు



సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

ఆత్మకూరు: ఈనెల 8 నుంచి జరిగే ప్రజా చైతన్యయాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ సూచించారు. బుధవారం స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల కోసం యాత్రల్లో గళం విప్పుతామన్నారు. సీపీఎం ప్రతినిధి బృందం పట్టణంలో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, వీరన్న, షేక్ ఇస్మాయిల్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి



ఎస్‌ఐలుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న వెలుగోడు ఎస్‌ఐ

వెలుగోడు: ఎస్‌ఐలుగా కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నందువల్ల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని వెలుగోడు ఎస్‌ఐ విష్ణునారాయణ సూచించారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన మద్దెల సతీష్, గుంతకందాల గ్రామానికి చెందిన నాగకీర్తన ఎస్‌ఐలుగా ఎంపికయ్యారు. వీరిని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు.

భక్తులు లేక వెలవెల



ఖాళీగా ఉన్న మహానందిలోని మాడవీధి

మహానంది: నిత్యం భక్తులతో రద్దీగా కనిపించే మహానంది ఆలయ ప్రాంగణాలు బుధవారం బోసిపోయి కనిపించాయి. ఉదయం నుంచి కొద్దిపాటి రద్దీ ఉన్నప్పటికీ సాయంత్రం నుంచి భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆలయ మాడవీధులు భక్తులు లేక నిర్మానుష్యంగా కనిపించాయి. ఉదయం, సాయంత్రం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు అష్టవిధ మహా మంగళ హారతులు నిర్వహించారు.

ఖర్జూరాల పంపిణీ



ప్రార్థనలు చేస్తున్న డైరెక్టర్ సాయిప్రణీత్, విద్యార్థులు

ఆత్మకూరు: స్థానిక సాయిబాబానగర్‌లోని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం డైరెక్టర్ సాయిప్రణీత్ ఖర్జూరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న వంద మంది విద్యార్థులకు ఖర్జూరాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, పుల్లారెడ్డి స్కూల్ హెచ్‌ఎం చాంద్‌బాషా, ఉపాధ్యాయులు ఫయాజ్, నారాయణ పాల్గొన్నారు.

అధికారులకు ధ్రువపత్రాలివ్వండి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: ఎన్‌హెచ్ 167–కె రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు వారి భూముల ధ్రువపత్రాలు అధికారులకు ఇవ్వాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. బుధవారం పెద్ద గుమ్మడాపురం గ్రామంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 16 మంది రైతులు 9 ఎకరాల భూమిని రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారన్నారు. వారు అధికారులకు ధ్రువపత్రాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా వాటిని అందిస్తే నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచు నక్కా విజయ్ కుమార్, వీఆర్వోలు మౌలాలి, శీను పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ అవసరం



సూచనలిస్తున్న సూపర్‌వైజర్ పావని

జూపాడుబంగ్లా: ఐదేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ అవసరమని తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని సూచించారు. బుధవారం స్థానిక ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీజీడేను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మహిళలు గర్భందాల్చిన వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖప్రసవం పొందాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

జనార్దనరావుకు ఘన నివాళి



జనార్దనరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: కార్మిక నాయకుడు తాళ్లూరి జనార్దనరావుకు సున్నిపెంటలో సీపీఎం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శ్రీశైలం ప్రాజెక్టులో పనిచేసిన ఎస్ఎంఆర్, వర్క్‌చార్జ్‌డ్, కార్పొరేషన్, కాంట్రాక్ట్ కార్మికుల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన జనార్దనరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. స్వామిరెడ్డి భవనం నుంచి కార్మికులు ఎర్ర జెండాలు చేతబూని బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ ఉన్న జనార్దనరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు కె.నాగిరెడ్డి, డి.ఓబులయ్య, పి.పులిరాజు, బి.లక్ష్మయ్య, ఎస్.అనిల్, శివశంకర్, మత్తేష్, ప్రసాద్, మల్లికార్జున, గురవయ్య, మల్లి, వెంకట్, లక్ష్మయ్య, బాషా, పాపమ్మ, గంగాధర్, నరసింహా, మల్లికార్జున, దానియేల్, శివ, రామయ్య, కుమార్, శంకర్, శ్రీను, అబ్దుల్లా, గౌరి పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

బండి ఆత్మకూరు: రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి తెలిపారు. ఏ.కోడూరు, ఈర్నపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ఫార్మర్ రిజిస్టర్ అయిన రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు, భూ ఆధార్ చెల్లింపులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా పథకాలు అందుతాయన్నారు.

ఆయకట్టు రైతుల ఆందోళన



జూపాడుబంగ్లా సమీపంలో మూయించిన పంట కాల్వ తూము

జూపాడుబంగ్లా: కేసీ కాల్వ వెంట ఉన్న పంటకాల్వల తూములు మూయించటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటపొలాలకు సాగునీరు పారకుండా తూములు మూయిస్తే పొలాలకు ఎలా నీరుపారించుకోవాలని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయమై కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,500క్యూసెక్కులు, మల్యాల ఓ మోటారు ద్వారా 350క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు వదులుతున్నట్లు తెలిపారు. ఈ నీరు దిగువన ఉన్న లాకిన్సలా వరకు కేవలం 300క్యూసెక్కులు మాత్రమే చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్‌కాల్వకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కేసీ కాల్వలో పారుతున్న నీటిని ఎగువనున్న ఆయకట్టు రైతులు వినియోగించుకొంటుండటంతో దిగువన ఉన్న ఆయకట్టు రైతులకు అందటం లేదన్నారు. దీంతో ఎగువన ఉన్న తూములను మూడు రోజులపాటు పూర్తిగా మూయించి నీటిని దిగువ ఆయకట్టు రైతులకు అందేలా చేస్తున్నట్లు తెలిపారు. అందుకు ఎగువనున్న ఆయకట్టు రైతులు సహకరించాలని ఏఈ శ్రీనివాసనాయక్ కోరారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి



మినరల్ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న ఆర్వో ప్లాంట్ నిర్వాహకులు ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని తహసిల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం మండలంలోని దుద్యాల గ్రామంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ నిర్వాహకులు తగినంత మోతాదులో కెమికల్ వాడాలన్నారు. నీటి కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఈఓఆర్‌డీ పార్థసారథి ఉన్నారు.

నేడు వేలం పాటలు

వెలుగోడు: వారపు సంత, దిన మార్కెట్, బస్టాండు, కబేలాలకు గురువారం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుంకన్న తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంత మార్కెట్‌కు రూ.50,000, దిన మార్కెట్‌కు రూ.50,000, కబేలాకు రూ.30,000 డిపాజిట్ చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలన్నారు.

ఫైజీ అరెస్టుకు నిరసన

వెలుగోడు: ఢిల్లీలో ఎస్‌డీపీఐ జాతీయ అధ్యక్షులు ఎం.కె. ఫైజీ అరెస్టు ఖండిస్తూ బుధవారం మదీనా మసీద్ వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. తక్షణమే విడుదల చేయాలని నాయకులు మహబూబ్ బాషా, సయ్యద్, తౌసిఫ్, ఆన్సర్, మోయిన్ డిమాండ్ చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద జనాలు గుమికూడవద్దన్నారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల దూరం ఉండాలన్నారు. ఈయన వెంట టౌన్ ఎస్‌ఐ చంద్రశేఖర్ న్నారు.

మహిళ ఆత్మహత్య

బండిఆత్మకూరు: మండల పరిధిలోని కాకనూరు గ్రామానికి చెందిన మరియమ్మ (50) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. మల్లెపోగు ప్రసాద్, మరియమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. బుధవారం మరియమ్మ అనారోగ్య కారణాలతో కల్లాపి పౌడర్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి

జూపాడుబంగ్లా: ఉపాధి పనులు కల్పించాలని తాటిపాడు గ్రామానికి చెందిన కూలీలు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లేక ఇప్పటికే పలువురు వలస వెళ్లారు. ఉన్న వారైనా వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఓ గౌరీబాయిని వివరణ కోరగా ఎంపీడీఓ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు కల్పిస్తామన్నారు.

బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచు రవి యాదవ్

నందికొట్కూరు: బిజినవేముల గ్రామంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీల విజేతలకు నగదు బహుతులు అందించారు. గణపతి సహిత శ్రీలక్ష్మీ సత్యనారాయణ స్వామి, సీతా లక్ష్మణ హనుమ, రామచంద్ర స్వామి, హనుమ ధ్వజ, వృషభ ధ్వజ, ఆలయ శిఖర సహిత, వీరాంజనేయస్వామి, రాధాకృష్ణ, వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా ఎడ్ల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. విజేత ఎడ్ల యజమానులకు సర్పంచ్ రవి యాదవ్, తదితరులు నగదు బహుమతులు అందజేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



తరిగోపులలో జొన్నపంట వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో జొన్నలో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం తరిగోపుల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రబీపంటల ఈపంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సొంత పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్‌రిజిస్టర్ చేయించుకోవాలన్నారు.

పంట మార్పిడి తప్పనిసరి

పాములపాడు: పంట మార్పిడి తప్పనిసరి అని వ్యవసాయ అధికారులు ఫణీశ్వర రెడ్డి, హేమలత రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భానుముక్కల, బానకచర్ల గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. రసం పీల్చే పురుగు నివారణకు మినుము పంట చుట్టూ నాలుగు వరసల్లో జొన్న పంటను కంచ పంటగా సాగు చేసుకోవాలన్నారు.

చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

నందికొట్కూరు: అందరి సహకారంతో చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ ఆరుబయట వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. చుట్టు ఉన్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు.